క్లుప్తంగా

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొమరాడ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రజని కుమారి ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్‌లో చేరేందుకు బాలికల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని, ఆసక్తి ఉన్న వారు ఆధార్‌కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఫోన్ నంబర్ ఇవ్వాలన్నారు. ఈ నెల 24వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 23న అభ్యర్థులకు పరీక్ష నిర్వహిస్తామని, మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 9652144140, 8008306780 సంప్రదించాలని కోరారు.

ఉగాది రోజున సామూహిక గృహ ప్రవేశాలు


సబ్‌కలెక్టర్‌తో సమావేశమైన హౌసింగ్ పీడీ రఘురాం

పాలకొండ రూరల్: ఉగాది రోజున జగనన్న కాలనీల్లో సామూహిక గృహ ప్రవేశాలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, లబ్ధిదారులంతా సిద్ధం కావాలని సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ కోరారు. శుక్రవారం పాలకొండ విచ్చేసిన హౌసింగ్ పీడీ పి.రఘురాం సబ్‌కలెక్టర్‌ను కలిసి, గృహ నిర్మాణాల స్థితిగతులను వివరించారు. నగర పంచాయతీ పరిధిలోని ఇళ్ల నిర్మాణాల వేగవంతానికి చర్యలు చేపడుతున్నామని, దాదాపు ఇళ్లు శ్లాబ్ దశలో ఉన్నాయన్నారు. 780 మంది లబ్ధిదారుల ఇళ్లు పునాది దశలో ఉన్నాయని, వాటిని కూడా పూర్తి చేసేలా అవగాహన కల్పిస్తున్నామని పీడీ అన్నారు.

నిరంతర సాధనతోనే విజయం సొంతం


పోలీస్ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న యువతకు సూచనలిస్తున్న ఎస్‌ఐ షన్ముఖరావు


గుమ్మలక్ష్మీపురం: ఏ రంగంలోనైనా నిరంతరం సాధన చేస్తేనే విజయం సొంతమవుతుందని ఎల్విన్‌పేట ఎస్‌ఐ ఎస్.షన్ముఖరావు తెలిపారు. పోలీస్ కానిస్టేబుల్, ఎస్‌ఐ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న పలువురిని మండల కేంద్రంలోని హెచ్ గ్రౌండ్‌లో శుక్రవారం ఉదయం కలిసిన ఆయన ఫిజికల్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం గ్రౌండ్(రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్) సాధన చేయాలని తెలిపారు. మిగిలిన సమయం రాత పరీక్ష కోసం సిద్ధం కావాలన్నారు. ఆయన వెంట పీడీ బి.వైకుంఠరావు ఉన్నారు.

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ ప్రారంభం


ప్రాక్టికల్స్ చేస్తున్న విద్యార్థులు

భామిని: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులంతా ప్రాక్టికల్స్‌కు హాజరై, చక్కగా పరీక్ష రాశారు. అనంతరం ప్రయోగం చేశారు. ఈ నెల ఏడో తేదీ వరకు ఈ ప్రయోగాత్మక పరీక్షలు జరుగుతాయని ప్రిన్సిపాల్ ఎర్రంనాయుడు తెలిపారు.

విశాఖలో జరడ కాలనీ వాసి మృతి


మృతి చెందిన వెంగళరావు

సీతంపేట: మండలంలోని జరడ కాలనీ గ్రామానికి చెందిన గిరిజనుడు ఎస్.వెంగళరావు(45) శుక్రవారం విశాఖపట్నంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. 12 ఏళ్ల క్రితం పనుల నిమిత్తం విశాఖ వలస వెళ్లి అక్కడే స్థిరవాసం ఏర్పరుచుకున్నాడు. అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని సోషల్ మీడియాలో సమాచారం రావడంతో మృతదేహాన్ని తీసుకురావడానికి బంధువులు విశాఖపట్నం వెళ్లారు.

పగలు ఎండ.. రాత్రి చలి..!


మండుటెండలో గొడుగు నీడలో నడిచివెళ్తున్న గిరిజనులు


సీతంపేట రోడ్డులో దట్టంగా కురుస్తున్న మంచు

- వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు
- పగటిపూట పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- రాత్రి సమయంలో తీవ్రతరమవుతున్న చలి
- కొన్నిరోజులుగా ఇదే పరిస్థితి నెలకొనడంతో ప్రజలు ఇక్కట్లు

సీతంపేట: ఈ ఏడాది వేసవికి ముందే సూరీడు సుర్రుమంటున్నాడు. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతో పగలు తీవ్రమైన ఎండలు, రాత్రి తీవ్రమైన చలి నెలకొంటోంది. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో అయితే ఈ పరిస్థితి మరీ అధికంగా ఉంది. ఫిబ్రవరి నెలాఖరు నుంచి సూర్యుడు ప్రతాపం చూపిస్తున్నాడు. ఇంకా వేసవికాలం పూర్తిగా రానేరాలేదు. ఇప్పటి నుంచే ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. కొన్నిరోజులుగా పగటి పూట 32 నుంచి 34 వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గతేడాది మార్చి మూడో వారం వరకు ఉష్ణోగ్రతల్లో పెరుగుదల లేదు. ఈ ఏడాది మాత్రం ఫిబ్రవరి నుంచే ఎండలు మండుతుండడంతో రాబోయే రోజుల్లో పరిస్థితి ఇంకెలా ఉంటుందోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

గాలిలో తేమశాతం..

రాత్రి పూట చలితీవ్రత వేధిస్తోంది. గాలిలోని తేమ శాతంలో భారీ హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు పగలు ఎండ, రాత్రి చలి బారినపడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి, వేకువ జాము సమయాల్లో 19 నుంచి 22 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. పగటిపూట గాలిలో తేమశాతం 56 నుంచి 60 శాతం మధ్య నమోదవుతుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. రాత్రిపూట గాలిలో గరిష్టంగా 90 వరకు తేమశాతం నమోదవుతోందని, ఈ నేపథ్యంలో రాత్రి పెరిగే చలి తీవ్రతతో వృద్ధులు, పిల్లలు, దీర్ఘకాల రోగాలు, ఆస్తమాతో బాధపడేవారు అవస్థలు పడుతున్నారు. ఆ సమయంలో ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

తేదీ	పగటి ఉష్ణోగ్రత(డిగ్రీల్లో)	రాత్రి ఉష్ణోగ్రత(డిగ్రీల్లో)
ఫిబ్రవరి–28	31	18
మార్చి–1	32	20
మార్చి–2	32	19
మార్చి–3	34	18

ఇప్పటి నుంచే జాగ్రత్తలు పాటించాలి..

వేసవిలో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలి. వాతావరణంలో చేసుకుంటున్న మార్పులతో ఇబ్బందులు తప్పవు. ముఖ్యంగా పగటిపూట ఎండలు అధికంగా ఉన్నాయి. ఎండలో ఎక్కువగా తిరగవద్దు. మంచి ఆహారం తీసుకోవాలి. ఎక్కువగా నీరు తాగాలి. బీపీ, మధుమేహం వంటి దీర్ఘకాల రోగాలతో బాధపడే వారు మరింత అప్రమత్తంగా ఉండాలి.

–ఎ.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, సీతంపేట

పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ


పాలకొండ: కరపత్రాలు విడుదల చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే కళావతి తదితరులు

పాలకొండ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా అందరూ పనిచేయాలని శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ కోరారు. ఇదే విషయమై శుక్రవారం పట్టణంలోని ఏఎంజీ మీటింగ్ హాల్లో నియోజకవర్గంలోని జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, పార్టీ సీనియర్ నాయకులతో సమావేశమైన ఆమె స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న నర్తు రామారావును భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మాట్లాడుతూ నియోజకవర్గంలో 99 శాతం మంది పార్టీ ప్రజాప్రతినిధులు ఉన్నారని, వారంతా రామారావుకే ఓటు వేయాలని అభ్యర్థించారు. అలాగే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను కూడా పట్టభద్రులైన ఓటర్లంతా గెలిపించి, విశాఖ రాజధాని కావాలన్న బలమైన ఆకాంక్షను వినిపించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు కోసం గ్రామాల వారీగా బృందాలు ఏర్పాటు చేసుకుని, పనిచేయాలన్నారు. స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్సీగా పోటీలో ఉన్న నర్తు రామారావు, పట్టభద్రుల ఎమ్మెల్సీగా బరిలో ఉన్న సీతంరాజు సుధాకర్‌ను విజయతీరం చేర్చేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్సీ ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాలకొండ, సీతంపేట, వీరఘట్టం, భామిని మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా విస్తృత ప్రచారం


పాలకొండ: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు జగన్ తదితరులు


గుమ్మలక్ష్మీపురం: చాపరాయి బిన్నిడిలో ప్రచారం చేస్తున్న వైస్ ఎంపీపీ లక్ష్మణరావు

వైఎస్సార్ సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా పార్టీ నేతలు పలువురు శుక్రవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులైన ఓటర్ల ఇంటింటికీ వెళ్లి, మొదటి ప్రాధాన్యతా ఓటు సుధాకర్‌కు వేసి, భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. మరికొంతమంది వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తూ, కరపత్రాలు పంపిణీ చేస్తూ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తున్నారు. ఆయనను గెలిపించి, విశాఖ రాజధాని కావాలన్న ఉత్తరాంధ్రుల బలమైన ఆకాంక్షను వినిపించాలని పిలుపునిస్తున్నారు. ఈ నెల 13న జరిగే పోలింగ్‌లో ఓటర్లంతా పాల్గొని, ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. –సాక్షి నెట్‌వర్క్

ఏపీపీటీడీ ఈయూ ఆందోళన

పాలకొండ రూరల్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీపీటీడీ ఈయూ(ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ ఎంప్లాయిస్ యూనియన్) స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట శుక్రవారం ఆందోళనకు దిగింది. ఈ సందర్భంగా యూనియన్ పాలకొండ డిపో కార్యదర్శి దుమ్మి గౌరీశ్వరరావు మాట్లాడుతూ ఆరు నెలల ఓటీ బకాయిలు చెల్లించాలని, గ్యారేజీ, నైట్ అవుట్ తదితర అలవెన్స్‌ల చెల్లింపులపై యాజమాన్యం సమాధానం ఇవ్వాలన్నారు. అలాగే డిపోలో ఖాళీల భర్తీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఈయూ నాయకులు వై.ఆర్.కె.పాత్రో, సందీప్ ఆలీ, స్వరాజ్య రమణి, శంకర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓలకు ఓటర్ స్లిప్‌లు అందజేత

పాలకొండ రూరల్: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి, ఓటర్ స్లిప్‌లను ఎంపీడీఓలకు అందించినట్లు సబ్‌కలెక్టర్ కార్యాలయం ఏఓ ఎం.సావిత్రి శుక్రవారం తెలిపారు. వీటిని పాలకొండ, రాజాం నియోజకవర్గాల్లోని 153 మంది ప్రజాప్రతినిధులకు అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. వీరిలో ఇద్దరు ఎమ్మెల్యేలు, 8 మంది జెడ్పీటీసీలు, 143 మంది ఎంపీటీసీలు ఉన్నారని పేర్కొన్నారు.

వలసల నివారణకే 'ఉపాధి' పనులు

- ఎంపీడీఓ డొంక త్రినాధులు


గరుగుబిల్లి: వేతనదారుల మస్తర్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాలకొండ రూరల్: గ్రామీణ ప్రాంతాల నుంచి వలసల నివారణకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పిస్తున్నారని ఎంపీడీఓ డొంక త్రినాధులు అన్నారు. శుక్రవారం మండలంలోని ఎం.సింగుపురం, అట్టలి, డోలమ, పనుకువలస గ్రామాల్లో జరుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఆయన నిర్దేశిత కొలతల్లో నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం వస్తుందన్నారు. రెండు పూటలా సమయానికి పనులకు హాజరు కావాలని వేతనదారులకు సూచించారు. వేసవి నేపథ్యంలో పని ప్రదేశంలో తాగునీరు, ప్రథమ చికిత్సా కిట్, టెంట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

భామిని: మండలంలోని లివిరి గ్రామ ఊర చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ గుర్ల కృష్ణారావు శుక్రవారం పరిశీలించారు. వేసవి నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా పని ప్రదేశంలో తాగునీరు ఏర్పాటు చేయాలని, అలాగే టెంట్లు, ప్రథమ చికిత్సా కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రెండు పూటలా కొలతల ప్రకారం పనులు చేస్తే మంచి వేతనం వస్తుందన్నారు.

జియ్యమ్మవలస: మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ ఎస్.రమేష్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి పని కల్పించాలని సూచించారు. పనులకు రాని వారికి మస్తర్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఈసీ తేజేశ్వరరావు తదితరులు ఉన్నారు.


జియ్యమ్మవలసలో జరుగుతున్న ఉపాధి పనుల్లో వేతనదారులు


పాలకొండ రూరల్: ఎం.సింగుపురంలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రినాధులు

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ జి.పైడితల్లి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె వేతనదారుల మస్తర్లు పరిశీలించి, పనిలోకి రాని వారి మస్తర్లు వేయవద్దని సూచించారు. నిర్దేశిత కొలతల్లో రెండు పూటలా పనులు చేయాలని అప్పుడే రోజుకు రూ.257 వేతనం లభిస్తుందన్నారు. ఆమె వెంట ఏపీఓ టి.రామకృష్ణంనాయుడు, టీఏ కె.నిర్మల, ఎఫ్ఏ టి.చిన్నమ్మ ఉన్నారు.

సీజనల్ వ్యాధుల బారినపడకుండా జాగ్రత్త వహించాలి

- డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు


సూచనలిస్తున్న డీఎంహెచ్ఓ జగన్నాథరావు

గరుగుబిల్లి: సీజనల్ వ్యాధుల బారినపడకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్త వహించాలని డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు సూచించారు. శుక్రవారం మండలంలోని రావుపల్లి గ్రామంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంను పరిశీలించిన ఆయన వేసవి నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా చూసుకోవాలన్నారు. ఎండ బాగా ఉన్నప్పుడు వీలైనంత వరకు ప్రయాణాలు తగ్గించుకోవాలన్నారు. ఒకవేళ అత్యవసరమై బయటకు వెళ్తే వెంట గొడుగు, తాగునీరు తీసుకువెళ్లాలని తెలిపారు. తరచూ మజ్జిగ, నిమ్మరసం తీసుకోవాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన అక్కడి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరాతీశారు. అలాగే వారు రక్తహీనత బారినపడకుండా ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. గృహ సందర్శన చేసి, హైరిస్క్ గర్భిణులను గుర్తించి, ఆస్పత్రికి తరలించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి కె.సాగర్ తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే నిందితులను అరెస్ట్ చేయాలి

- దళిత జేఏసీ నాయకుల డిమాండ్


పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న దళిత జేఏసీ నాయకులు

పాలకొండ రూరల్: దళిత యువకుడు జమ్మాన సుదర్శన్‌ను హత్య చేసిన దుండగులను తక్షణమే అరెస్ట్ చేయాలని దళిత జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం జిల్లాలోని బూర్జ మండలంలో ఉన్న నీలంపేటకు చెందిన సుదర్శన్‌ను అదే గ్రామానికి చెందిన ఆధిపత్య కులస్తులు కొంతమంది హత్య చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి మృతదేహం తీసుకురాగా, ఈ విషయం తెలుసుకుని అంబేడ్కర్ ఇండియా మిషన్ రాష్ట్ర సైనిక్ కన్వీనర్ తైక్వాండో శ్రీను, ఆలిండియా దళిత రైట్స్ ఫోరం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల అధ్యక్షుడు కంఠ వేణు, బత్తిన మోహనరావు తదితరులు ఆస్పత్రికి చేరుకుని, సుదర్శన్ మృతికి నివాళులర్పిస్తూ బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం పాలకొండ డీఎస్పీ కృష్ణారావు, శ్రీకాకుళం దిశ డీఎస్పీ వాసుదేవరెడ్డిలతో మాట్లాడి, మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ ఘటనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సత్యసాయి మందిరం అభివృద్ధికి రూ.లక్ష విరాళం

పాలకొండ రూరల్: పట్టణంలోని శ్రీశయన వీధిలో ఉన్న సత్యసాయి మందిరం అభివృద్ధికి విశాఖపట్నానికి చెందిన భవన నిర్మాణ కాంట్రాక్టర్ కామర్స్ రామారావు రూ.లక్ష విరాళం ప్రకటించారు. త్వరలో జరగనున్న సత్యసాయి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ప్రకటించిన మొత్తం(నగదు) అందజేస్తారు.

నేక్ అక్రిడేషన్‌పై ఓరియంటేషన్


కార్యక్రమంలో మాట్లాడుతున్న రిసోర్స్‌పర్సన్ రాజు

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేక్(నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్) అక్రిడేషన్‌పై ఓరియంటేషన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నేక్ గుర్తింపునకు సంబంధించి, ప్రిన్సిపాల్ జి.జనార్దన నాయుడు పలు అంశాలు వివరించారు. అంతకు ముందు వైస్ ప్రిన్సిపాల్ బి.ప్రభాకరరావు నేతృత్వంలో వికరణ భౌతికశాస్త్రం దాని అనువర్తనాలు, మానవాళికి భౌతికశాస్త్రం ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజు, అధ్యాపకులు ఎం.ఎస్.కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి, పెన్షన్ అందజేత



సీతంపేట: శ్రీకాకుళంలోని రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీతంపేట ఏజెన్సీ గ్రామం రాయిలంకకు చెందిన కొండగొర్రి కృష్ణారావుకు వెల్ఫేర్ అసిస్టెంట్ లలిత శుక్రవారం పెన్షన్ అందజేశారు. ఆస్పత్రికి వెళ్లి, పెన్షన్ అందజేయడంపై అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి పెన్షన్ అందిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ లలిత

క్రీడాకారునికి ఘనసన్మానం


దొరబాబును సత్కరిస్తున్న గ్రామస్తులు

గుమ్మలక్ష్మీపురం: హర్యానాలోని కురుక్షేత్రంలో జరిగిన ఆలిండియా నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో హైజంప్‌లో గోల్డ్ మెడల్ సాధించిన రాయగడ జమ్ము గ్రామస్తుడు పువ్వల దొరబాబును గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. సర్పంచ్ పత్తిక అమల, ఎంపీటీసీ మండంగి శ్రీలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో తమ గ్రామానికి చెందిన వారు రాణిస్తుండడం చాలా సంతోషంగా ఉందని, రాబోయే రోజుల్లో మరిన్ని టోర్నీల్లో పాల్గొని, సత్తా చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్యదర్శి వాసుదేవరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పత్తిక బీసు, మండంగి బీమారావు, తాడంగా పాపారావు తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన ర్యాలీ


ర్యాలీలో పోలీస్, ఫారెస్ట్ అధికారులు

వీరఘట్టం: ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా మండలంలోని కిమ్మి, నడుకూరు గ్రామాల్లో వన్యప్రాణుల సంరక్షణపై శుక్రవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డీఆర్ఓ రవిబాబు మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని, జనావాసాల్లోకి వచ్చే వన్యప్రాణులను సురక్షితంగా అడవుల్లోకి తరలించాలన్నారు. ముఖ్యంగా గజరాజులను వెళ్లగొట్టేందుకు వాటికి సమీపంలోని చెరకు తోటలు, గడ్డివాములకు నిప్పంటించవద్దన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్ఐ హరికృష్ణ

వీరఘట్టం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా స్థానిక బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ సీహెచ్ సత్యనారాయణ, ఎస్ఐ హరికృష్ణ కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ నెల 13వ తేదీన పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా ఏర్పాట్లు చేయాలని వారు సూచించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే పోలింగ్‌లో పట్టభద్రులైన ఓటర్లంతా పాల్గొని, ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ మారుతీరావు పాల్గొన్నారు.

చింతపండు కొనుగోలు లక్ష్యాలు అధిగమించాలి


మాట్లాడుతున్న జీసీసీ డీఎం మహేంద్రకుమార్

గుమ్మలక్ష్మీపురం: చింతపండు కొనుగోలు లక్ష్యాలను అధిగమించాలని పార్వతీపురం జీసీసీ డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జీసీఎంఎస్ కార్యాలయంలో సీసీపీఏలతో సమావేశమైన ఆయన నాణ్యమైన చింతపండు కిలో రూ.32.40కు కొనుగోలు చేయాలని తెలిపారు. అమ్మకాలు చేపట్టిన వెంటనే నగదు చెల్లించాలన్నారు. సమావేశంలో బ్రాంచ్ మేనేజర్ వి.కృష్ణప్రసాదరావు, గొడౌన్ ఇన్‌చార్జ్ ఎం.సాంబశివరావు పాల్గొన్నారు.